"ఓహో! భగవంతుడు అన్ని వైపులా చూస్తున్నాడన్నమాట. సరే. భగవంతుడు ఇప్పుడు ఏం చేస్తున్నాడు?" ప్రశ్నించాడు నవాబు.

"మీ ప్రశ్నకి జవాబు చెప్పబోయేముందు ఓ సారి దివాన్‌గారి కుర్చీని ఖాళీ చేయమని ఆజ్ఞాపిస్తారా?" అడిగాడు ఖాజి.

రాజుగారి ఆజ్ఞ ప్రకారం దివాన్ తన ఆసనంలోంచి లేవగానే నవాబుని అందులో కూర్చోమని కోరాడు ఖాజి. తర్వాత ఖాళీ అయిన నవాబు ఆసనంలో ఖాజి కూర్చుని చెప్పాడు.

"దేవుడు ఇప్పుడు చేసింది ఇదే."

"ఓహో. ఎవరికి ఏం జరిగినా అది దేవుడే చేస్తాడన్నమాట."

తన ప్రశ్నలకి తగిన సమాధానాలు దొరికాయని తృప్తి పడ్డ నవాబు ఖాజికి తగిన సత్కారం చేసి పంపించాడు.

## 85. దైవ స్మరణ ఎలా సాగాలి?

ఓ సాధువు కాశీకి వెళ్తూ దారిలో ఓ గ్రామం శివార్లలోని ఓ దేవాలయంలో బస చేసాడు. అతను బయట జపం చేసుకుంటూ పక్కనే వున్న నూతిలోంచి నీళ్ళు తోడుకోడానికి వచ్చిన ఇద్దరు యువతుల సంభాషణ విన్నాడు.

"పెళ్ళయ్యాక మొదటిసారి కదా నువ్వు పుట్టింటికి రావడం. నీ భర్త నీకు గుర్తుకు వస్తున్నాడా?" అడిగింది ఒకామె.

"అవును. మల్లెలని చూడగానే గుర్తుకు వస్తున్నాడు. ఈ ఆషాఢ మాసం ఎప్పుడు అవుతుందా అని ఎదురు చూస్తున్నాను." జవాబు చెప్పింది రెండో ఆమె.

"నాకు మా ఆయన కాక, నా ప్రియుడు లెక్క పెట్టలేనన్ని సార్లు గుర్తుకు వస్తున్నాడు. నిరంతరం అతనే నా మనసు నిండా నిండి వున్నాడు. నీతో మాట్లాడుతున్నా ఏ పని చేస్తున్నా నా మనసు నిండా అతని ధ్యాసే. రాత్రి ఎప్పుడవుతుందా, అతన్నెప్పుడు కలుస్తానా అని వుంది." మొదటి యువతి చెప్పింది.

ఆ సాధువుకి అనిపించింది, తను రెండవ యువతి తన భర్తని ఎలా తలుచుకుంటోందో తను దేవుడ్ని అలా తన చేతిలో జపమాల వున్నంతసేపే

స్మరిస్తున్నాడని, మొదటి యువతి తన ప్రియుడ్ని ఎలా మనసు నిండా నింపుకుందో తను అలా సర్వావస్థల్లోను దేవుడ్ని జ్ఞప్తిలో వుంచుకోవాలని.

వెంటనే అతను తన చేతిలోని జపమాలని విసిరేసి లేచి గుళ్ళోకి వెళ్ళిపోయాడు.

## 86. పువ్వులు-నవ్వులు

ఓ గ్రామాధికారి దగ్గర పనిచేసే ఒక పనివాడు నిత్యం భుజాన కావిడితో చెరువుకి వెళ్ళి, రెండు కుండల నిండా నీళ్ళని నింపుకుని తన యజమాని ఇంటికి తీసుకు వెళ్ళేవాడు. ఓ కుండకి చిన్న పగులు వుండటంతో, అతను చెరువు నించి యజమాని ఇంటికి చేరేలోగా దారిలో ఆ కుండలోని నీళ్ళు చుక్క చుక్క ఆ పగులు లోంచి కారిపోయేవి. రెండో కుండలోని నీరు కారకుండా నిండుగా ఇంటికి చేరేది.

ఇలా కొంతకాలం గడిచాక మొదటి కుండ రెండో కుండతో చెప్పింది.

"నన్ను ఏ పనికైతే నియమించారో దాన్ని నేను సక్రమంగా చేస్తున్నాను. కాని నువ్వు సగం నీటిని దారిలో ధారపోస్తూ నీ యజమాని పట్ల విధేయతగా లేవు."

ఆ మాటలకి బాధపడ్డ ఆ రెండో కుండ తనని పనివాడు చెరువుకి తీసుకెళ్ళి నీళ్ళు ముంచాక చెప్పింది.

"నాకు ఎంతో సిగ్గుగా వుంది."

"దేనికి?"ప్రశ్నించాడు నీరు మోసేవాడు.

"గత రెండేళ్ళ నించి నేను నీటిలో సగాన్నే చెరువు నించి తెస్తున్నాను. మిగతా నీటిని దారిలో జార విడుస్తున్నాను. నా యజమానికి నేను పూర్తి న్యాయం చేయడం లేదు కనక నాకు సిగ్గుగా వుంది."

పనివాడు చిన్నగా నవ్వి చెప్పాడు.

"సరే. మనం తిరిగి ఇంటికి వెళ్ళే దారిలో నీ కు ఇరువైపులా ఏం కనబడుతుందో చూడు."